# కుర్చీలు

**ఆదివిష్ణు**




వెంకట్రావ్ నాతోపాటు చదువుకుని కొన్నేళ్ళ క్రితం చదువు మానేసి వ్యవసాయంలోకి దిగిపోయేడు. అతని కిప్పుడు పాతిక ఎకరాల భూమి వున్నదని నాకు తెలుసు. మంచి 'కామందని' పల్లెటూళ్లో మంచి పేరూ వున్నది.

ఈ కామందుకి ఓ మేనల్లుడున్నాడు. అతనీ మధ్యనే బి. ఏ. పాసైన వైనం నాకు మునుపోక సారి వెంకట్రావే చెప్పేడు.

ఒకానొక ఆదివారం సాయంత్రం నేనింటి దగ్గిర కాఫీ పుచ్చుకుంటోన్న వేళ నన్ను చూసేందు కొచ్చినతని పేరు సంగమేశ్వరరావు. బక్కగా, తెల్లగా వున్నాడు. పేరు చెప్పి నీళ్ళు నమలడం ప్రారంభించేడతను. అతను కూర్చునేందుకు ఒక పేముకుర్చీ చూపించేను. అతను దాన్లో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు. కూర్చుని అన్నాడు,

"మీ కథలు చదువుతాను సార్! చాలా బావుంటాయి!"

అందమైన మాటనే చెప్పేడతను. ఒక కాఫీ పట్టుకొచ్చి యిచ్చేను. అతనా కాఫీ తాగుతూండగా 'మీరేం చేస్తూంటారని' అడిగేను. నన్నభిమానించే పాఠకుల వివరాలు తెలుసుకోడం నా కనీస ధర్మం. మీదుమిక్కిలి సంభాషణా క్రమాన్నది అందంగానూ మలుస్తుంది.

అతను కుర్చీలో యిబ్బందిగా సర్దుక్కూర్చుని అన్నాడు—

"బి. ఏ. పాసైయాను సార్! ప్రస్తుతం ఖాళీ!"

"మీకూ కథలు రాసే అలవాటేమైనా వుందా?"

"లేదు సార్!"

"చదువుతారంతే. అవునా? ఆ మాత్రం చేస్తుంటే ఏదో ఓనాడు మీరూ రాసే గలరు." అన్నాను నా అభిమానిని సరదాపరిచే నిమిత్తం.

అతన్నీరసంగా నవ్వేసి నా ఉద్దేశాన్ని తంపేసి అన్నాడు.

"మీరీవూరు బదిలీ అయ్యేరని మావయ్య చెప్పేడు. కనిపించి పోదామని వచ్చేను."

కొంచెం ఆలోచించి అడిగేను.

"ఎవరండీ మీ మావయ్య?"

"వెంకట్రావ్‌గారు!"

"చెప్పేరు కాదే! వెంకట్రావ్ మేనల్లుడా మీరు. వాడు నాకు బెస్టు ఫ్రెండు. భేష్ బాగుంది వేరీగుడ్. ఊఁ. ఏమిటీ విషయాలు? మీ వాడు క్షేమమా? నేనీ వూరొచ్చింత కాలమైనా యిప్పటికొచ్చి వాడు నాకు కనిపించనేలేదు."

"మీరు చాలా అదృష్టవంతులు సార్! సొంతవూళ్ళో చక్కటుద్యోగంతో ఎంచక్కా కాలక్షేపం చేసేస్తున్నారు."

"బలే! ఈ వూరొచ్చేందుకు నేను నాలుగేళ్ళు ప్రయత్నం చేశాను. దాని కేమంటారు మరి?"

"ఏమైనా మీరు అదృష్టవంతులనే అంటాను."

"సర్లెండి. అలాగే అనుకుందాం. చెప్పండి. ఏమిటి సంగతులు?"

"ఏముంటాయి సార్! ఎప్పటికప్పుడు మిమ్మల్ని చూచిపోదామని అనుకుంటూనే చాలా ఆలిస్యం చేసేను. మొన్న మధ్య మినర్వాలో మీ ఫ్రెండ్సుతో కనుపించేరు. అంతమందిలో మిమ్మల్ని డిస్టర్బ్ చేయడమెందుకని వూరుకున్నాను."

"అదేమిటండీ! మంచివారేనే! డిస్టర్బ్ చేయడమేమిటండీ బొత్తిగా .. నో .. అదేం బాగోలేదు."

సంగమేశ్వరరావు ఇక్కడ సిగ్గు నభినయించేడు. కాఫీ కప్పు కింద వుంచుతూ వొన్పుతూ అన్నాడు.

"ఈ మధ్య రెండుమూడు ఇంటర్వ్యూలు వొచ్చేయండి. అవుతే అవన్నీ పరాయి వూళ్ళలో. అందుచేత నేను వెళ్ళలేదు.. ఉద్యోగం చేస్తే మనూళ్ళోనే చేయాలని వుంది."

"అవునవును ఈ రకమైన ఆలోచనలు మనూరివాళ్ళకి చాలామంది కున్నాయి సుమాండి. బాగుంది."

"ఈ విషయం మావయ్యతో చెబితే నాకేం తెలీదు నీదారేదో నువ్వే చూచుకోమన్నాడు. అప్పుడిహ మీరు నాక్కనిపించేరు."

ఇదీ వరస. ఈ సంగమేశ్వరరావు నాకథల్ని మెచ్చుకోడానిగ్గానీ, లేదూ నేటి తెలుగు కథా రీతి గురించిగానీ మాటాడేందుకు రాలేదు. అది గమనించి నేను బాధపడ్డానుగానీ సంగమేశ్వరరావు కది తెలీనివ్వలేదు. ఇంకా అతనే మాటాడేడు—

"మీ ఎరికలో ఇక్కడేమైనా ఉద్యోగాలుంటే సాయం చేసి పెట్టండి."

"అదిసరే! బట్..నేనీ వూరొచ్చి అర్నెల్లైనా కాలేదింకా.."

"ఫర్లేదండి. నాలుగైదు నెలలాగమన్నా ఆగుతాను. ఉద్యోగరీత్యా మీరీవూరొచ్చి ఆర్నెల్లే అయినా మీకీ వూళ్ళో ఎవరెవరెంతెంత చనువుందో నాకు తెలుస్సార్!" అన్నాడతను తెలివిగా, తెగింపుగా, చొరవగా, కించిత్తు లౌక్యంగాను.

ఉద్యోగం కోసం వొచ్చినవాడికి తప్పనిసరిగా వినయ విధేయతలుండి తీరాలని, నేననుగానీ, బొత్తిగా నెత్తికెక్కి 'ఏం, వాయ్! నా విషయమేం చేస్తావని డబాయించి అడిగేస్తే మండదూ? అవుతే నేనేం మండిపడిపోలేదు. పైపెచ్చు నీకీ డబాయింపు ధోరణి నప్పదని గూడా చెప్పలేదు. నేను మొహమాటస్థుడిని. నేనేమంటే ఎదటివాడేమైపోతాడో నన్న దిగులున్న వాడిని. అందుచేత సంగమేశ్వరరావు బతికిపోయేడు. నేను మాత్రం తిరకాసుగానే మాటాడవలసి వొచ్చింది.

"నాకీ వూళ్ళో ఎంత పరపతి వున్నది చెప్పేరు. బాగుంది. మీకీ వూళ్ళో కావలసిన ఉద్యోగమెలాటిదీ? దానికోసం ఎవర్ని అడిగి చూడమంటారూ? ఈ మొదలైనవి గూడా చెప్పేసి వెళ్ళిపోండి." అన్నాను.

అప్పుడతను నిజంగా ఇబ్బందిలో మునిగిపోయినట్టు గమనించేను. మా యింటివేపూ నావేపూ, నేను కూర్చున్న కుర్చీవేపూ గబగబా చూచిగాని చెప్పలేదు.

"మీకు పశుపతిగారు తెలుసుగా సార్?"

ఈ ఒక్కమాటా అనేసి అతనొచ్చిన కార్యం సిద్ధించినంతగా సంబరపడిపోయేడతను. అతను వెళ్ళిపోయినా పశుపతిగారి గురించి నా ఆలోచనలు మాత్రం దూరం కాలేదు.

పశుపతిగారికి మా వూళ్ళో మంచి పేరుంది. ఒక్కగానొక్క మేడుంది. రెండు కారులు కాబోలు—అవీ వున్నాయి. జ్యేష్ఠుడి పేరేమిటో తెలీదుగానీ అతనస్తమానూ క్లబ్బుల్లోనూ సినిమాల్లోనూ కనిపిస్తాట్ట. ఒక కుమార్తె గూడా వుంది. మావూరి కాలేజీలో బుద్ధిగా చదువుకుంటుందని నాకెవరో చెప్పేరు. ఇంత బలగం కలిగి వున్న పశుపతిగారికి మావూళ్ళో ఒక గొప్ప వ్యాపారము వున్నది.

ఎగుమతీ దిగుమతీలకు సంబంధించిన ఆ వ్యాపారము దినదినాభివృద్ధి చెందుతున్న విషయం ఆ సంస్థలో ఉద్యోగం చేస్తూన్న మావూరి వాళ్ళు చాలామంది చెప్పేరు. పశుపతిగారి వ్యాపారాభివృద్ధి గురించి అక్కడి ఉద్యోగస్థులందరి మాటా ఒక్కటేగానీండి, వాళ్ళ ఉద్యోగ నిర్వహణ వగైరా విషయాల్లో మాత్రం భేదాభిప్రాయాలున్నాయి. దీనిమూలంగా పశుపతిగార్ని చాలా రకాలుగా వూహించుకోవలసిన అవసరమెంతైనా వుంటుంది. క్లాస్ వన్ ధర్మరాజని కొద్దిమంది చెప్పేరు. వొట్టి దుర్మార్గపు మనిషని చాలామంది అన్నారు. స్వార్థముందిగానీ, అది ఎదటి వాడిని ముంచేది కాదని కొందరి విశ్వాసం. ఏమైతేనేం పశుపతిగారు దైవస్వరూపులు. ఒకే దేవుడు అనేకమంది కనేక రకాలుగా ఎలా కన్పిస్తాడో సాక్షాత్తు వీరూ అంతే!

పశుపతిగారితో నాకు పరిచయమున్న మాట వాస్తవమే! స్థానికంగా ఏర్పాటు చేయబడే సంఘ కార్యకలాపాల్లో ఆయన్నాకు తారసపడ్డారు. మొదటిది (గుర్తున్నది) పట్టణ యువజన సంఘ వార్షికోత్సవంలో నేను వక్తను. ఆనాడు పశుపతిగారు మొదటి వరసలో ఓ అందమైన కుర్చీలో కూర్చున్నారు. కార్యక్రమం పూర్తయింతర్వాత, శ్రీవారితో నాకు పరిచయ భాగ్యం కలిగింది. సంఘ నిర్వాహకులు పశుపతిగారికి నాగురించి 'అతి'గానే చెప్పేరు. అప్పుడాయన మందహాసం చేసి వీలు చిక్కినప్పుడు తనని తప్పక కలుసుకోవలసిందిగా కోరేరు. రెండోతడవ కాబోలు వారికి నేను కావలసిన మనిషినయ్యేను! నేను రాసిన నాటకాన్ని పుర నటులు కొందరు మా వూళ్ళోనే ప్రదర్శించేరు. ఆ ప్రదర్శనకి సినీమా చిన్ననటులొకరు హాజరయ్యేరు. వారిదీ మావూరే! వారి పక్క కుర్చీలోనే పశుపతిగారు కూర్చున్నారు. ఆనాటి ప్రదర్శన నిజానికి రక్తి కట్టిందనే చెప్పాలి. రచయితగా ప్రేక్షక మహాశయులకు నన్నానాడు వేదిక మీద, పరిచయం చేశారు. తదనంతరం మా పూర్వం మాష్టారొకాయన నా గురించీ, నా నాటకంలోని నటుల గురించీ ఉద్ఘాటించేరు. ఆపైన పశుపతిగారు సినీమా చిన్ననటునితో నన్ను కలుసుకున్నారు. వారికి నన్ను పరిచయం చేసి ఆనక నన్నో మంచి నాటకం కొత్తది రాయమని అడిగేరు.

కానీ, పశుపతి గారంత పెట్టుబడల గల మనిషని నాకానాడనిపించలేదు. సరిగ్గా వారంరోజులు గడవగానే ఓ సాయంత్రం నన్ను వారింటికి పిలిపించేరు. వెళ్ళేను.

వారిల్లు అందంగా వుంటుంది. పాలరాతి మేడలా నున్నగా వుంటుంది. చుట్టూతా ముచ్చటైన ప్రహరీ ఒకటుంది. ప్రహరీ అందున మనోహరమైన క్రోటన్సు వున్నాయి. నేను వెళ్ళిన వేళకి పశుపతిగారొక్కరూ మల్లెపందిరి కింద ఓ కుర్చీలో (వాలుడి ఖరీదైనది.) నడుంవాల్చి పుస్తకమేదో తీరుబడిగా చదువుతున్నారు. వారినా స్థితిలో చూచినప్పుడు నేనసూయ చెందేను. ఈ మనిషికింత దర్పాని, ఇంత ఆనందాన్ని విస్ఫారణంగా ఆ భగవంతుడేల అనుగ్రహించేడాని బాధపడిపోయేను.

తిన్నగా వెళ్ళి నేనాయన కొంచెం దూరంలో నించున్నాను. నేనొచ్చినట్టు పశుపతిగారు గమనించలేదు కాబోలు. కాని వారి కుక్క గమనించి మేడ మీంచి అరిచి గోల పెట్టేసింది. పశుపతిగారు పుస్తకాన్ని తొలిగించి నన్ను చూచిన మీదట చిన్న హాసరేఖ పెదాల మీదుగా వెలిగించి, వారి కుక్కని మందలించేరు.

కుక్క నోరు మూసుకున్నది!

ఆయన, నన్ను కూర్చోమన్నట్టు నటించేరు. అక్కడే ఖాళీగా వున్న మరో కుర్చీలో వినయంగా కూర్చోవాలనుకున్నానుగానీ, కుదరక చాలా మామూలుగానే కూర్చున్నాను.

వంటమనిషో, పనిమనిషో తెలీదుగాని ఒకతను కాఫీలు పట్టుకొచ్చి మా కందించేడు. ఇంక మరి తాగవలసిందిగా తలతో తెలిజేసి వారమ్మాయిని పిలిపించేరు. ఎందుకలా అనవసరంగా ఆ పిల్లని పిలుస్తున్నారో అర్థమైందికాదు. వారమ్మాయి దాదాపు నాట్యం చేస్తున్నట్టు వొస్తూ, దార్లోనే ఓనమస్కారం పారేసి, వొచ్చి మరో కుర్చీలో కూర్చుంది.

ఈ అమ్మాయినింత కంటె చిన్నతనంలో వేనవేసార్లు చూసేను. ఆడపిల్లలు సైకిలు తొక్కడమనే విద్యని హర్షించలేని వూరు మాదికాదుగానీ, విడ్డూరంగా చూచే మానవులు నాతో పాటు చాలామంది మా వూళ్ళో వున్నారు. పశుపతి గారమ్మాయి సైకిల్మీద సాయం సమయాల్లో అలా ఆ తార్రోడ్డు వెంట షికారు కొచ్చేది. వెనగ్గా ఓ బంట్రోతు నురుగులు కక్కుతూ, రొప్పుతూ వొచ్చేవాడు. అప్పుడు నాకా అవస్థంతా చిత్రంగా కనుపిస్తూండేది. అందుచేత పశుపతి గారమ్మాయిని నేనీ జన్మలో మరిచిపోలేను గదా!

"శకుంతల. మా అమ్మాయి. బియస్సీ చదువుతోంది. వీళ్ళమ్మ చదువింక కట్టేయమంటుంది. నేనేమొ మెడిసన్ చదివిద్దామంటాను. శకుంత లేమొ సినీమాల్లో చేరతానంటుంది. ఇదండీ మా కథ!" అన్నారు పశుపతి.

నేను చాలా కథలు రాసేను. కొన్ని నిజమైన కథలూ రాసేను. కానీ పశుపతిగారు చెప్పిన కథ నాకు నచ్చలేదు. నన్నడుగుతే దానికి కథనే పేరూ తగదని చెప్తాను.

పశుపతిగారి మాటలకు శకుంతల సిగ్గుపడినట్లే కనిపించింది మరి. తనకున్న రెండు జడల్లో ఓ జడని ముందుకు లాక్కుని రెండుచేతుల్తో ఆ జడని అల్లుతూంది.

కాసేపలా జరిగింతర్వాత పశుపతిగారు వారి అసలు ఉద్దేశాన్ని బహిరంగం చేసేరు.

"మీరు మంచి నాటకాలు రాస్తారని నాకు తెలుసు. మరేం లేదు. మా శకుంతల సినీమాల్లో చేరాలనే ఉబలాటాన్ని తండ్రిగా నేను కొట్టిపారేయలేక పోతున్నాను. మీరు ఓ బ్రహ్మాండమైన నాటకం రాయండి. దాన్లో శకుంతలకి మంచి పోర్షను ఎంచండి. అయ్యిందా ఈ నాటకాన్ని నా సొంత ఖర్చుల మీద అటు మదరాసూ, ఇటు హైద్రాబాదూ రెండూర్లలోనూ ప్రదర్శించే ఏర్పాటు చేస్తాను. నాటకం మాత్రం చాలా బాగుండాలి. పెద్దపెద్ద సినీమా డైరెక్టర్లు, నటులు వగైరాలను ప్రదర్శనకి పిలిపించే బాధ్యత నాదే. అదృష్టం బాగుంటే అమ్మాయికి సినీమాల్లో ఛాన్సు దొరకొచ్చు. అంతే కాకుండా నాటక రచయితగా మీక్కూడా ఏదైనా ప్రయోజనమూ వుండొచ్చు. ఆలోచించండి."

నేనాయన పథకాన్ని విని తెల్లబోయేను. ఇంతకు మునుపు నాతో ఎవరూ ఈ ప్లానుని చెప్పలేదు. పశుపతిగారి తెలివి అమోఘం. మధ్యలో నాక్కూడా ఇంత 'ఆశ' మేత పెట్టేరు. కానీ, చాలా బాగా నచ్చే కొత్త నాటకాన్ని నేనెంత కాలంలో రాయగల ననేది మొదటి సమస్య. ఆ రాసిన నాటకం ఈయన గారి కెంత నచ్చుతుందనేది ముఖ్యమైన రెండో సమస్య. అందుచేత నే నప్పుడాయనకి ఏవిధమైన హామీ యివ్వలేకపోయేను.

నేను వారింటి నుంచి తిరిగొచ్చిన నాటి నుంచీ నేటివరకూ నేను నాటకం రాయనూ లేదు. ఇప్పటికొచ్చి నేనాయన క్కనిపించనూ లేదు. అలాంటప్పుడీ సమయంలో సంగమేశ్వరరావు ఉద్యోగం నిమిత్తం మళ్ళీ నేనాయన్ని చూడవలసి వస్తే నా గొంతుకి ఉరి పడేమాట ఖాయం! పోనీ, నేనేదైనా నాటకం రాసివుంటే ఆసందర్భంగా ఆయన్ను కలుసుకోవచ్చు. నేనీ మధ్య అస్సలేమీ రాయడంలేదు. గనక ఇక వార్ని కలుసుకోడమనే మాట తీసిపారేశాను.

కానీ, ఇటు సంగమేశ్వరరావు నన్ను బ్రతకనిచ్చేలా లేడు. బొత్తిగా నన్ను తినేస్తున్నాడు. తరచూ మా యింటికొచ్చి అత నుద్యోగ విషయ మెంతవరకు వచ్చిందో కనుక్కొవెడుతున్నాడు. మధ్యనుధ్య పశుపతిగారి ప్రయాణాలూ, వారి తీరుబడి వైనాలూ, యివన్నీ హెచ్చరించడం గూడా చేస్తున్నాడు.

ఒకనాడు, పార్కులో వెంకట్రావే కనిపించేడు. కనిపించిన వాడు క్షేమసమాచారములు మాని 'నిందలు' వేయడం ప్రారంభించేడు.

"అవున్లేవోయ్. మేం నీకిప్పుడు ఏం కనిపిస్తాం? పెద్దవాడివి. అదికాదు గురూ! నీ అదృష్టం పండి నువ్వు పెద్దవాడివయ్యావంటే మేమంతా సంతోషిస్తున్నాం.బాగుంది. కాని అంతమాత్రం చేత మన స్నేహితాన్ని మరిచిపోతే ఏంబాగుంటుంది చెప్పు?" అన్నాడు వెంకట్రావు.

అపరాధిలా తలెత్తకుండానే అన్నాను.

"నన్నేం చేయమంటావో చెప్పు వెంకట్రావూ?"

"కుర్రముండా వాడు కాలికి బలపం కట్టుకుని రోజూ మీ యింటికి వొస్తూపోడం తప్పించి నువ్వొక్కనాడైనా ఆ పశుపతి గార్ని కలుసుకున్నావా? ఉద్యోగం యివ్వడం, మానడం తర్వాత విషయం. ఇప్పటికొచ్చి నువ్వాయన్ని కలుసుకోలేదంటే నాతల కొట్టేసినంత పనవుతోంది. మా వాడేమొ నామీదా, మన స్నేహం మీద కొండంత ఆశ పెట్టుకున్నాడాయిరి. అబ్బే ఇదేం బాగోలేదు గురూ! నువ్వేమైనా అనుకో. అంతే!" అన్నాడు బాధగా.

నేనెందుచేత ఆ పశుపతి గార్ని కలుసుకోలేకపోతున్నానో కారణం వెంకట్రావుకి చెబ్దామనిపించింది. అది చెప్పి అతన్ని వొప్పించే దానికంటే, అభిమానం చంపుకుని

పశుపతిగార్నే కలుసుకోవాలని నిర్ణయించుకొని వొచ్చేను.

నాటినుంచి నాలుగురోజులు నిద్ర మానుకుని రచనలో కూచున్నాను. అయిదో నాటి సాయంత్రం నాటకాన్ని తయారుచేసి స్క్రిప్ట్ చేతపట్టుకుని పశుపతిగారింటికి వెళ్లేను.

పశుపతిగారి జ్యేష్ఠుడు బజారు వేపు వెడుతున్నాడు కాబోలు కారు తాళంచెవిని (ఇగ్నిషన్‌కీ) సరదాగా వూపుకుంటో ఎదురయ్యేడు. అతను భారీఎత్తు మనిషి. రెపటలా గాలి కెగిరిపోయే అవతారం! నెత్తి మీద అరంగుళం మేర వెంట్రుకలు కత్తిరింపబడి వుంటాయి. ఎల్లప్పుడూ బాగా బిగువైన పంట్లాములు ధరిస్తాడు. చొక్కా అనబడని ఏదో వొస్త్ర విశేషాన్ని చొక్కాగా వేసుకుంటాడు. అంతెత్తు మనిషి గాల్లో ఎగిరిపోతున్నట్టు నడుస్తూంటే నాక్కొంచెం కంటగింపుగా వుంటుంది.

అప్పుడతని నెత్తి మీద ఒక ఊలుటోపీ గూడా వున్నది. ఈ రకమైన టోపీలకీ రోజుల్లో పరపతి పెరిగిపోతోంది. ఆ టోపీతో, ఆ నడకతో అతన్నాకు ఎదురైనప్పుడు ఒక 'కొంగ' నేల మీద నడుస్తున్న భ్రాంతి కలిగింది.

ఆ కొంగ నన్ను విష్ చేసి చేయికలిపి ఇంగ్లీషులో నా క్షేమాన్నడిగింది. వాళ్ల డాడీ కోసవొచ్చేనని ఇంగ్లీషులోనే చాలా డాబుసరిగా చెప్ప ప్రయత్నించేనుగానీ, కుదిరి చావలేదు. లోపలున్నారని చెప్పి కారు దగ్గిరికి ఎగిరెళ్లిపోయిందా కొంగ.

లోపలికి వెళ్లేను పశుపతి గారింకా నిద్రలేవని కారణంగా కాసేపా వరండాలోనే కూర్చోవలసి వచ్చింది. కూర్చుని నా రచనలోని సొగసుని అక్కడక్కడా గమనించడం ప్రారంభించేను. డాబా మీద గదుల్లో ముందేదో శబ్దమయ్యింది. వెనువెంటలే 'ధా. ధిక్..ధై ధిక్..ధక్ ధక'లు మగ గొంతు నుంచి వినవచ్చేయి. ఆ పదాల కనుగుణంగా పాదతాకిడీ వినిపించింది. ఈ తతంగం యావత్తూ నానెత్తి మీదనే జరుగుతున్నది. కాసేపట్లోనే నాకు చిరాకు వేసింది.

నాట్యమనేది లలితకళల్లో ఒకటని వేనొప్పుకుంటాను. ఎందుచేతనోగాని నేనెంత ప్రయత్నం చేసినా శాస్త్రీయ నాట్యంలోని ఔన్నత్యాన్ని వెతుక్కోలేకపోతున్నాను. ఇది కేవలం నాతప్పన్నా వే నొప్పుకునేందుకు సిద్ధమే!




[illegible] తూన్న వేళకి పశుపతిగా[రు] రావడం జరిగింది. లేచి నించున్నాను. ఆయన కూర్చున్న తర్వాత నేనూ కూర్చున్నాను. ఆయనొక్కడే సిగ రెట్టు ముట్టించి అన్నాడు.

"మీర్నాకు కనిపించి రెండునెలలు దాటిం దనుకుంటాను."

"అవునండి. ఈ మధ్యన ఆరోగ్యం బాగో లేక బయటకి రాలేకపోయేను."

"ఈ సంవత్సరం ధరల్లాగా ఎండలెంత మండిపోయేయో గమనించేరా?"

"అవునండి. చాలా మండిపడిపోయేయి వర్షాలూ అంతేను. అతివృష్టి."

"అగ్నిప్రమాదాలు అవిగూడా ఈ సంవత్సరం ఎక్కువే."

"అవునండి. బాగా ఎక్కువే."

"ఏమిటో కలికాలం యావత్తూ యిలా తగలబడిపోతోంది."

"అవునండి.."

ఈ తడవ వంత పాడటమిష్టం లేక పోయింది. ఆయన వరస చూస్తుంటే నా నాటకం విషయం మరిచిపోయినట్టనిపి స్తోంది. లేకపోతే వారింతన్యాయంగా మాటాడేవారు కానేకాదు. అందుచేత నాకై నేనే నాటకోదంతాన్ని ప్రారంభించేను.

"మీరు చెప్పినట్టు నాటకం రాసేను. కానైతే నెలరోజుల కాలాన్ని రెండునెలల వరకూ పొడిగించేను. క్షమించాలి. పోతే ఈ నాటకాన్ని బాగా రాయగలిగేనన్న ధైర్య ముంది. ఓమాటు మీరు గూడా చదువుతే.."

"ఐతే, నాటకం పూర్తయిందన్నమాట. ఏమిటోనండి ఈమధ్య తీరుబడి చిక్కక చాలా సరదాలు చంపేసుకుంటున్నాను. చూద్దాం. నాటకమిచ్చి వెళ్ళండి" అన్నా రాయన చప్పగా, చేదుగా.

పుస్తకమిచ్చి చేతులు నలుపుకున్నాను. మెల్లిగా అసలు విషయంలోకి సంభాషణ మార్చేను.

"నాకో ఫ్రెండున్నాడు. చాలా మంచి వాడు."

"పేరేమిటన్నారు?"

"వెంకట్రావని మమూరివాడే! అతని కో మేనల్లుడున్నాడు."

"పేరేమిటన్నారు?"

"సంగమేశ్వరరావని చెప్పి బి. ఏ. పాసై య్యాడు."

"ఏం చేస్తున్నాడన్నారు?"

"ఆ విషయం మాటాడేందుకే వచ్చేను.

# కుర్చీలు

అతను ప్రస్తుతం నిరుద్యోగి. మంచివాడూ, తెలివైన వాడూను."

"ఐసీ."

"మీ కంపెనీలో ఏదైనా ఖాళీ వుంటే అతనికో ఛాన్స్ యిస్తారేమోనని ఎప్పటి కప్పుడు అడుగుదా మనుకుంటూనే వాయిదా వేస్తూ వచ్చేను."

"చెప్పారు కాదే! బలేవారే మీరు మీకంత మొహమాటం పనికిరాదు సుమండీ."

నాకొంచెం సరదాగా వున్నది. కుర్చీలో ముందుకి జరికూర్చున్నాను.

"కానీ, ప్రస్తుతం మా కంపెనీలో, ఖాళీలేమీ లేవు. ఉంటే గనక మీకు తప్పని సరిగా ఖబురంపుతాను సరేనా? పోతే. ఈ పుస్తకం మీ దగ్గరే వుంచుకోండి. కావలిసి వొస్తే నేనే అడిగి పుచ్చుకుంటాను. ఓ.కె.?' అన్నారు.

"ఓ. కె." అనేశాను.

ఆయన లేచి నించున్నారు. నేను లేచి వచ్చేశాను.

*　　*　　*

నెల రోజులు గడిచింతర్వాత సోరోజున సంగమేశ్వరరావు అర్జంటుగా మా యింటి కొచ్చేడు. ఒచ్చీరావడంతోటే గబ గబా రాలుగూ అనేశాడు నిప్పుతొక్కినకోతిలా -

"రామనాథంగాడికి ఉద్యోగం వచ్చింది. నాకంటే వాడు జూనియర్. పైగా ఫూల్. అయినాసరెవాడికే ఉద్యోగం ఇచ్చేరు పశుపతి గారు. అప్పుడే వారం రోజులైపోయింది గూడాను."

"నే నడిగితే ఖాళీ లేవని చెప్పేడే మరి."

"లేపోతే, ఉన్నాయని చెబ్తారేమిటండీ! మీరు మరీను."

"అసలింతకీ రామనాథం ఎవడోయ్?"

"డాన్సుమాస్టరు సోమయాజుల్లేరండీ," వాళ్ళ తమ్ముడు. సోమయాజులు పశుపతిగా రమ్మాయికి డాన్స్ నేర్పుతున్నాడుగదా! ఆ పరి చయంలో ఆయనగారేమో ఈ ఫూల్ గాడికి ఉద్యోగం వేయించేశాడు" అన్నాడు కసిగా.

నేనున్నాను. నేను నాటకాలవీ రాస్తాను. నా నాటక మొకటి ఆమధ్య పశుపతిగారికి కావలసి ఒచ్చింది. ఆరకంగా నాకూ ఆయ నో పరిచయమున్నట్టేగా. కానీ, నాకున్న పరిచయంతో ఈ సుబుద్ధికి నేను ఉద్యోగం వేయించలేకపోయేను. అంటే, ఈ మొత్తా నికి అర్థమేమిటి? ఆ డాన్సుమాస్టరు సోమ [illegible] యిత తిసికట్టన్నమాట. ఇదీ, టూకీగా సంగమేశ్వరరావు గుండెల్లోని అభిప్రాయం.

దీనికి నేనేం బాధ పళ్ళేదు. సంగమేశ్వర రావు వెళ్ళిపోయింతర్వాత నిట్టూర్చేను. అంత పరపతీ, అంత హోదాగల పశుపతి గారీ చిన్న విషయంలో అబద్ధమెందుకు చెప్పాలని మాత్రం బాధపడిపోయేను. పశు పతిగారికి నేను సోమయాజులుకంటే ముందు నుంచీ తెలుసు ఆయన్లా నాట్యాలు నేర్ప లేకపోయినా నేనూ ఆయన్లా ఒక కళా కారుడ్నే! పశుపతిగారీ విలువల్ని గ్రహించే ముందొచ్చిన నన్ను కొట్టి పారేసి వెనకొచ్చిన ఆ సోమయాజుల్ని గౌరవించడమనే విష యంలో చింతించేను. ఆనాటినుంచీ పశు పతిగారిమీద విరోధం పెట్టుకోవలసి వచ్చింది.

ఈ కథ ముఖ్యంగా పశుపతిగారూ, సంగ మేశ్వరరావూ, నేనూల మధ్యింతవరకూ జరి గింది. నాకు మావూళ్ళో ప్రాణం సైతం ధారపోసే మిత్రుడు మూర్తివున్నాడు. అత న్నింతవరకూ ఈ కథలో పరిచయం చేయ లేదు. మూర్తి గూడా కథలు రాసే కుర్రాడు. మే మెల్లప్పుడూ కలిసే తిరుగు తూంటాం

సోనా డతనింటికి వెళ్ళేను. అతనప్పుడు చాలా తొందరగా ఉన్నాడు నన్నుచూస్తూనే

"రా గురూ! రా! నీ కోసమే చూస్తు న్నాను. లేపోతే ఈవేళకి బస్సెండుతో వుండవలసిన పని" అన్నాడు.

"ఏమిటో విశేషం?"

"మా విశ్వమన్నయ్య వస్తున్నాడు. ఉత్తరం రాసేడు. రేపు సాయంత్రం టవున్ హాల్లో మీటింగేదో ఉన్నదట. అదవ్వ గానే రాత్రికి మా పల్లెటూరు వెళ్ళిపో నాలి. ఈ వార్త మా వాళ్ళకి చెప్పేందుకు వెడుతున్నాను."

మూర్తి మా వూరివాడే అని చెప్పాలి. చదువూ, ఉద్యోగం రెండూ ఈవూళ్ళోనే. వాళ్ళ సొంతవూరు మా వూరుకి పది మైళ్ళలోవున్న పల్లెటూరు అక్కడే ఇల్లూ, పొలం గట్రా వున్నాయి. వారానికో తడవ అక్కడికి వెళ్ళివస్తూంటా డతను.

మూర్తిని బస్సెక్కించి ఇంటిమొహం పట్టేను. దాంతో మూర్తి వాళ్ళన్నయ్య జ్ఞాపకాని కొచ్చేడు.

ఈ భూమిమ్మీద నుంచి 'టేలెంట్' వున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళప్రతిభా

విశేషం కొన్నాళ్ళకిగాని గమనింపుకిరాదు. మూర్తి వాళ్ల దొడ్డమ్మగారబ్బాయి ఈ విశ్వం. ఆనర్సు పూర్తయింతర్వాత మద రాసు వెళ్ళిపోయి సినిమాల్లో చేరేడు. నాలుగైదేళ్ళ ప్రముఖ దర్శకుల దగ్గిర పన్జేసి మొన్నీ మధ్యనే విడుదలైన ఓ తెలుగు సినిమాకి డైరక్టరయ్యేడు. దాన్లో చాలామంది కొత్తవాళ్ళు నటించేరు. ఆ సినిమాలో ఆకర్షణలు చాలా ఉన్నాయి. పత్రికలు ఆ సినిమాని ఆకాశాని కెత్తేశాయి.

అందుచేత విశ్వం ప్రఖ్యాతి నలుదిశలా ఈనాడు వ్యాపించింది. ఈ సినిమా నాలుగో వారం ఆడుతూండగానే మరో రెండు సినిమాలకి దర్శకుడుగా నియమింపబడినట్లు పత్రికల్లో వార్తలొచ్చేయి. కాబట్టి ప్రతిభ గల మనిషెప్పటికైనా రాణిస్తాడనే ధర్మ సూత్రం ఈ విశ్వం ద్వారా నిజమైంది.

ఆ సాయంత్రం నాకేం తోచలేదు. మూర్తి యింట్లోలేడు. పురమందిరానికి వెళ్ళేడని చెప్పేరు. హోటల్లో యింత కాఫీ తాగి నేనూ టవున్ హాలు వేపు వెళ్ళేను.

మా వూళ్ళోవున్న 'పట్టణ యువజన సంఘం' చాలా చక్కగా పన్జేస్తోంది. తగ్గవాళ్ళకి సన్మానాలూ, అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యకలాపాలు నెలకో తడవైనా ఏర్పాటు చేయడంతో మావూరి జనాభా రిలాక్సవు తోంటుంది.

వేనొస్తున్న రోడ్డుమీద, రోడ్డుకి అడ్డంగా పెద్ద పెద్ద అట్టలు కట్టి వుంచేరు. వాటిపైన 'విశ్వానికి స్వాగత మని' ఇంతింతక్షరాల్తో రాసేరు. కొన్ని అట్టల పైన అభినందనలూ వున్నాయి.

టౌన్ హాలు దగ్గిర జనం గుంపుల గుంపులుగా వున్నారు. గ్రామఫోన్ రికార్డులు మార్మోగు తున్నాయి. ఆ పాటలన్నీ విశ్వం సినిమాలోనివే కావడం ఒక ప్రత్యేకత! మధ్య మధ్య రికార్డులు ఆపి టౌన్ హాల్లో చేరిన ప్రేక్షక సమూహాన్ని నిశ్శబ్దంగా వుండాలని ఎవరో కీచు గొంతులో హెచ్చరిస్తున్నారు.

నేనక్కడ కాసేపు వించుని తిరిగి వెళ్ళ బోయేను. అప్పుడు మూర్తి కని పించేడు.

"బలేవాడివి గురూ! ఇంత లేటా?" అన్నాడు.

"నేనిక్కడికి రావాలని రాలెదు. ఏం తోచక వొచ్చేను."

"తగ్గవోయ్! నీ ఆఫీసుకి ఫోనురం పేను. చేరలేదూ?"

"లేదే?"

"ఫర్లేదు. ఆఁ నీకోసం సీటుంచేను."

వే నతన్తోపాటు లోపలి కెళ్ళేను. రెండో వరసలో మధ్యగా రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి. తిన్నగా అక్కడికే వెళ్లి కూర్చున్నాము. మే మెళ్లి కూర్చున్న క్షణనే, విశ్వ మొచ్చినట్లు మైకులో ఎవరో చెప్పేరు.

విశ్వంతో పాటు చాలా మంది ఖరీదైన మనుషులు లోపలి కొచ్చేరు. విశ్వం వేదిక మీదికి వెళ్ళగా మిగతా వాళ్ళందరూ మా ముందున్న మొదటి వరస కుర్చీల్లో కూర్చున్నారు. సరిగ్గా నా ముందు పశుపతిగారే కూర్చున్నారు. ఆయన నా మొహం చూచి గూడా పలుకరించ లేదు. నేనూ తల దించేశాను.

సరిగ్గా ఆయన కుడి వేపున మూడు కుర్చీలు ఖాళీగా వున్నాయి!

సభ ప్రార్థనతో ప్రారంభ మయ్యింది. 'వందే మాతరం' పాడినమ్మాయి పాట పూర్తయిం తర్వాత (ఫర్లేదు. బాగానే పాడింది.) వినయంగా చేతులు జోడించి విశ్వానికి నమస్కరించింది.

సంఘ కార్యదర్శి విశ్వాన్ని సభికులకు పరిచయం చేశాడు. అదైన తర్వాత విశ్వం కాసేపు మాట్లాడేడు. ఈ సినిమా ప్రపంచంలో తానెన్ని కష్ట లెదుర్కొని యీ స్థితి కొచ్చేడో చెప్పేడు. (వొంటికి మల్లెపూవులు తగలడం కూడా గొప్ప కష్టమేనా అనిపించింది నాకప్పుడు.) ఆంధ్ర ప్రేక్షకులు తన పట్ల చూపు తూన్న ఆదరాభిమానాలు శ్లాఘనీయ మన్నాడు. కళలకు ఆట పట్టైన మా వూళ్ళో తనకీ రకమైన అభినందన సభ ఏర్పాటు చేయడం ముదావహమనీ అన్నాడు. (అప్పుడు సభలో కరతాళ ధ్వనులు మిన్ను ముట్టేయి) తదనంతరం ఉప న్యాసం ముగించి కూర్చున్నాడు.

సంఘాధ్యక్షుల విన్నపాలూ ముగిసేయి. అవి జరుగు తూండగా విశ్వం తనకిచ్చిన పూల దండని ముక్కు దగ్గిరిగా వుంచు కుని ఏదో ఆలోచిస్తున్నట్లు కన్పిం చేడు.

ఉపన్యాసాలు పూర్తయిం తర్వాత విశ్వంతో పాటు వక్తలూ వేదిక దిగి కింది కొచ్చేశారు.

తర్వాత వినోద కార్యక్రమాలు. — అవి ప్రారంభించే ముందు నా ముందు వరసలో వున్న కుర్చీల్లో జరిగిన కొన్ని తమాషాలు రాస్తాను.

విశ్వం వేదిక దిగొచ్చి పశుపతిగారి కవతలగా వున్న మూడో కుర్చీలో కూర్చు న్నాడు. రెండో దాన్లో సంఘాధ్యక్షులు. పశుపతిగారి పక్కనే కార్యదర్శిను. ఇదీ సీను. కానీ, పశుపతిగారికీ వరస వచ్చినట్లు లేదు. సంఘ కార్యదర్శితో ఏదో మెల్లిగా చాలాసేపు మాటాడేరు. ఆ మీదట కొన్ని వొడంబడిక లేవో జరిగి వుంటాయి. అందు చేత కార్యదర్శి పశుపతిగారి కుర్చీలోకి వచ్చేడు. దరిమిలా అధ్యక్షుడూ కదిలి ఇవతల (కార్యదర్శిది) కుర్చీలోకి వొచ్చేడు. అప్పుడు విశ్వం ఎడంపక్క కుర్చీ ఖాళీ అయ్యింది. దాన్లో కెళ్లి కూర్చున్నాడు పశుపతి. అతని ఆరాటం నాకు చిరాకనిపిం చింది.

పశుపతి విశ్వానికి ఎడంపక్క కుర్చీలో కూర్చున్నాడన్న మాటేగానీ, విశ్వాని కవతల కుడిపక్కన కూర్చున్న మరో మనిషి మీద కోపమొచ్చి వుండాలి. ఎంచాతంటే ఆమనిషి విశ్వాన్ని జలగలా పట్టుకుని విడిచి పెట్టడం లేదు. తెగమాటాడేస్తున్నాడు. మొహమాటం కొద్దీ విశ్వం తలూపుతున్నాడు.

పశుపతి ఓ తడవ అవతల మనిషి వేపు మిర్రున చూసేడు. అది గమనించలేదా మానవుడు. తరవాత కార్యదర్శిని కళ్ళతో ఏదో హెచ్చరించేడు. అప్పుడా కార్యదర్శి తన సీట్లో నుంచి లేచివెళ్లి వినయంగా విశ్వం ముందు వించుని ఏదో చెప్పేడు. తన పక్కనే బాంబేదో పేలినట్టు ఉలిక్కిపడి ఎడంవేపు చూసేడు విశ్వం.

అప్పుడు పశుపతి రెండుచేతులూ జోడించి వెకిలిగా నవ్వేశాడు. ఆనక విశ్వాన్ని రెండుచేతులూ పుచ్చుకున్నాడు. ఈలోగా కార్యదర్శి విశ్వానికి కుడిపక్కన కూర్చున్న జలగని అక్కడినించి లేవవలసిందిగా అభ్యర్థించి, అతనికి తను లేచొచ్చిన కుర్చీని చూపించేడు. జలగ లేచి కార్యదర్శి ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుంది.

ఈ జలగ మొన్నామధ్య ఒక చిన్ని పరిషత్తులో ఉత్తమనటుడి బహుమతి పుచ్చు కున్న వైనం నా పక్క సీట్లో మనిషి చెప్పగా విని ఆశ్చర్యపోయేను.

విశ్వాన్ని జలగ విడిచి పెట్టినా పశుపతి విడిచి పెట్టలేదు. నవ్వేస్తూ, కుర్చీని కుడి

"సెమ్మా" రిదో వర్ణించి చెబుతున్నాడు. విశ్వం తన పూలదండవి వాసన చూస్తూ విసీ విన నట్టు వింటున్నాడు.

"మరో అయిదు నిమిషాల్లో 'మధురా నగరికి' ప్రారంభమవుతుంది. కుమారి శకుంతలా పశుపతి తమ నాట్యకౌశలాన్ని సహృదయులైన ప్రేక్షక మహాశయులకు





ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.




విలో కంపెని, మద్రాసు 1

పంటినొప్పా?
వాడండి లక్ష్మి మార్కు
జామా ఆయిల్
(రిజిస్టర్డు)

సర్వదా ఒక సీసా దగ్గర వుంచుకోండి
అమర్‌చంద్ శోభాచంద్
మద్రాసు-1.



KP-AS-10


# కుంపట్లు

పరిచయం చేస్తారు." అని ఎవరో కాగితమ్మీద రాసి చదివినట్టు మైకులో చెప్పేరు.

ఈ హెచ్చరిక విన్న జనాభా కెలావున్నదో గానీ నేనదిరి చచ్చేను. పశుపతిగారి వ్యూహాన్ని మెచ్చుకోక తప్పిందికాదు.

నా పక్క కుర్చీలోని మూర్తి బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నవాడిని చేత్తో కుదిపేను. కదిలి అన్నాడు.

"శకుంతలంటె సైకిలువాలా కదూ గురూ!"

"ఎక్జాక్ట్లీ. కొంచెం నీ ముందు చూడు. అసలైన నాట్యం యిక్కడే జరుగుతోంది" అన్నాను పశుపతిని చూపిస్తూ.

మూర్తి అటువేపు చూచి మెల్లిగా నవ్వేశాడు. నాట్యం ప్రారంభమయ్యే ముందు ఓ మనిషి ముందు వరస కుర్చీల దగ్గిర అటూ యిటూ నాలుగైదుసార్లు తిరగడం గమనించేను. ఇంటర్వెల్లో చేగోడి, బజ్జీ, టీ లమ్ముకునే కుర్రాళ్లని మరిపించే డతను. అతను చాలాసార్లు విశ్వం దృష్టి నాకర్షించుకునేందుకు ప్రయత్నం చేసేడుకానీ, ఫలించలేదు. చివరికి విసుగెత్తి వెనక వరస కుర్చీల్లోకి చేరుకున్నాడు.

"ఫలానా థియేటరు ప్రొప్రయిటరు" అన్నాడు మూర్తి.

"సినిమాలో వేషం కోసమా వొచ్చేడు?"

"అయ్యేవుంటుంది. మొన్నామధ్య ఒక డొక్కు సినిమాలో రెండు నిమిషాలపాటు వీపు వాయించుకున్నాడు. ఇప్పుడు మరో ఛాన్స్ కోసం చూస్తున్నాడు. ఈ తడవ గూడా ఏ వింజామరం లాటిది పుచ్చుకోడమో మొహాన్న కొడతారంతే!"

అయిదు నిమిషాలు గడిచినా నాట్యం ప్రారంభం కానేలేదు. ఉన్నట్టుండి పశుపతి గ్రీన్‌రూం వేపు పరుగెత్తేడు. కాసేపట్లో పశుపతి శకుంతలని వెంటబెట్టు కొచ్చేడు మొదటి వరస కుర్చీల దగ్గిరికి. ఆ అమ్మాయి తండ్రితో వొస్తున్నప్పుడు కెమేరాల్లో ఫ్లాష్‌లు గబగబా వెలిగేయి.

ఆ అమ్మాయి యింటి దగ్గిర కంటె యిక్కడంత అందంగాలేదు. సైకిలు తొక్కుతున్నప్పుడు చాలా అందంగా వుండేది. ఇప్పుడు అందంగా లేకపోయినా బరువుగా వున్నది. ఏవో చాలా అలంకారాలు చేసేరు. నేను నాట్యాలు చాలా చూసేను. ఇన్ని అలంకారాలతో మెరిసిపోతూ "వల్లలమ్మ బోదు—" అనెవ్వరూ ఎప్పుడూ ఎక్కడా నాట్యం చేయలేదు. మీదు మిక్కిలి ఆ అలంకారాలన్నీ గూడా కలిపి పెద్దసైజు వికృతాల్ని అక్కడ ప్రదర్శిస్తున్నట్టు నా కనిపించింది. అందుచేత శకుంతల నా స్థితిలో చూచినప్పుడు నేను చాలా సిగ్గుపడిపోయేను.

తండ్రి కోరినట్టు శకుంతల విశ్వానికి పాదాభివందనం చేసింది. రెండు ఫ్లాష్‌లు చిటిక్ చిటిక్ మని మెరిసేయి. అంతవరకూ బాగానే వున్నది. రెండునెలలు (సరిగ్గా నేను లెక్కవేయలేదు. ఉజ్జాయింపుగా అన్నాను.) శిక్షణతో మొదటిసారి కాలికి అందెలు కట్టి వేదిక ఎక్కి నాట్యం చేయడమనే గొప్ప విద్యకి ఒక ప్రఖ్యాత దర్శకుని ఆశీస్సులందుకోడంలో అనౌచిత్యం కన్పించదు. కానీ, పశుపతి ఓ వెండి కప్పు విశ్వం చేతికిచ్చి, ఆ కప్పుని శకుంతల కివ్వమని చెప్పి, వెనువెంటనే ఫ్లాష్‌లు మెరిపింపజేసే ప్రయత్నంలో వ్యాపారం దాగి వుంటుంది. ఇదే నాకు నచ్చలేదు. నాట్యం చూడక మునుపే బహుమతీ ప్రదానమని (అదీ శకుంతల వాళ్ళ సొమ్మే!) సంప్రదాయాన్ని వ్యాపార రహస్యమని నేనంటాను. ఈ కార్యక్రమాన్ని యావత్తూ ఫోటోల్లో నింపడం దారుణమనీ అంటాను.

దాంతో విశ్వమ్మీద నాకు కించిత్తు కోపమూ వొచ్చింది. కానీ, అతను పశుపతి గారడిలో మునిగిపోయిన కుర్ర దర్శకుడు. సినిమాల్లో పాత్రలనైతే తనిష్టం వొచ్చినట్టు మార్చుకోగలడుగానీ జీవితంలో పశుపతుల నేం చేయలేడు.

శకుంతల వెళ్ళిపోయింది. పశుపతి విశ్వం పక్కనే జాగ్రత్తగా కూర్చుని సిగరెట్టు ముట్టించేడు. విశ్వంతో కాసేపేదో మాట్లాడేడు. తెర తొలగడంతో మాటలాపేశాడు.

'మధురానగరి' ప్రారంభమయ్యింది.

నాట్యాలు చూడటమైతే జరిగింది కానీ వాటిని విమర్శించేంత స్తోమతు నాకులేదు. అయినా సరే శకుంతల చేస్తున్నది ఏ వన్ డాన్సంటే నేనొప్పుకోను. సోమయాజులు తలూపుతూ పాడుతున్నదానికీ, శకుంతల ఆంగికాభినయానికీ పొత్తేలేదు. ఎవరిష్టమొచ్చినట్టు వారు పాడుతున్నారు, చేస్తున్నారు. శకుంతల నేర్చుకున్న విద్య యింకా ప్రారంభదశలోనే ఉన్నదని చెప్పాలి.

ఇక నేను లేచి వెళ్లిపోడానికి సిద్ధపడ్డాను. మూర్తి బలవంతం చేసి కూర్చోపెట్టేడు.

ప్రముఖులంటూ వొచ్చింతర్వాత వారి యొక్క 'చేత్రాలు' కోసం అనేకమంది

సామాన్యమైన మనుషులు తహతహ లాడటం మామూలే. అప్పుడా నాడు అయిదారుగురు కాలేజీ విద్యార్థులు ముందు వరసకి వొచ్చేరు. ఆటోగ్రాఫ్ పుస్తకాలు పుచ్చుకుని. విశ్వానికి ఇలాటి అభిమానులే ముఖ్యమని నా ఉద్దేశం. పశుపతి మొహంలో రంగులు మారుతున్నట్టు పసిగట్టాను. విశ్వం వాళ్లకి సంతకాలు చేస్తూండగా పశుపతి వెర్రెత్తిన మనిషిలా ఖంగారుగా అటూయిటూచూసేడు. నాట్యం మధ్యలో ఇలా అనవసరంగా, వొచ్చిన ప్రతివాడికీ సంతకాలు పెట్టడం అతనికి నచ్చలేదు. నాట్యకళలో చేయించిన రెండు నెలల 'కృషి' వృధా అవడం మతరామూ యిష్టంలేదు. అందుచేత వొచ్చిన మనుషులకి సంతకాలైన పిదప పశుపతి లేచి వెళ్లి గేటు దగ్గిరున్న పోలీసుతో ఎదో చెప్పి వొచ్చి కూర్చున్నాడు. మరంతే. అట్నుంచి ఓ పిట్ట గూడా సంతకాలు నిమిత్తం ఇటు రానివ్వ లేదా పోలీసు.

'మధురానగరి' చాలాసేపటికిగాని పూర్తి కాలేదు! తర్వాత ఎదో జానపద నృత్యమని మైకులో 'చదివేరు.'

పశుపతి డ్రింకులు తెప్పించేడు. ముందుగా విశ్వానికో డ్రింకు యిచ్చేడు.

ఇక్కడ విశ్వం విజృంభించేడు. కుర్రవాళ్లంత తెలివి గలవాళ్లో చేతల్లో నిరూపించేడు. తనకిచ్చిన డ్రింకుని గబిక్కిన, వెనక్కి తిరిగి మూర్తికిచ్చేడు. మూర్తీ, నేనూ యిద్దరమూ తెల్లబోయేము. అంత వరకూ విశ్వం మమ్మల్ని గమనించలేదేమోనన్న మా భ్రమ పటాపంచలయ్యింది.

"తాగరా! మనం పదినిమిషాల్లో బయలుదేరి వెళ్లిపోదాం. పిన్నివాళ్లు ఎదురు చూస్తూంటారు కాబోలు. వీడు మూర్తని మా తమ్ముడండి"

పశుపతిగారి చేతిలోని రెండో డ్రింకు తీసుకుని నాకిస్తూ నన్నూ పరిచయం చేశాడు.

"రావుగారని కథలు రాస్తూంటారు."

పశుపతి చేతిలో వున్న మూడో డ్రింకు తాను పుచ్చుకున్నాడు! పశుపతిలో గొప్ప చలనం కలిగింది. నాలిక్కరుచుకుని తల బాదుకుంటూ అన్నాడు.

"అయ్యయ్యో! రావుగారు! రావుగారు, నాకు తెలీపోవడ మేమిటండి బాబోయ్!, వార్నాకు బాగా తెలుసు. మీరు అయన్నాకు పరిచయం చేస్తుంటే నాతల కొట్టేసినంత పనయింది. వారేమిటీ. నాకు తెలీకపోవడ మేమిటి? బలే వారేనే మీరు. (పునరుక్తి గమనించలేదు) వెనగ్గా కూర్చున్నారే స్వామీ! ఇలారండి. వొచ్చిక్కడ కూర్చోండి ముందు". అంటూ తను లేచి నించున్నాడు.

పశుపతి మీద జాలి కలిగింది. కానీ మేము ముందు వరసలోకి వెళ్లలేదు. పశుపతే వెనక్కి తిరిగి మాతో మాట్లాడేడు, ఆయన చాలా విషయాలు కొత్తగా చెబుతున్నట్టు చెప్పేడు. వాళ్లమ్మాయి నాట్యం, వాళ్లమ్మాయి నటన, వాళ్లమ్మాయి చదువు, వాళ్లమ్మాయి పెంకితనం— అల్లరీను. అయితే ఇవన్నీ విశ్వానికి చెప్పాలనే ప్రయత్నంలో మమ్మల్ని అడ్డుగా వాడుకున్న ఆయన చాతుర్యం గణనీయమే!

జానపద నృత్యం మధ్యలో మేం ముగ్గురం లేచి నించున్నాము. మమ్మల్ని బయట వరకూ సాగనంపేరు సెక్రటరీ, ప్రెసిడెంటూ, ధియేటరు ఓనరూ, ఉత్తమ నటుడూ వగైరాలు. పశుపతి మాత్రం నన్ను కొంచెం అవతలగా తీసికెళ్లి అడిగేడు.

"రేపు విశ్వంగారు యిక్కడే వుంటారా?"

"ఇక్కడేమో తెలీదుగానీ వాళ్ల పల్లెటూర్లో వుంటారు."

"వెడదామంటా రేమిటి?"

"చూద్దాం."

"అమ్మమ్మ! మీరా మాటనకూడదు. నేను రేపుదయం ఎనిమిదంటే ఎనిమిది గంటలకి మీయింటి కొస్తాను."

"సర్లెండి."

"అన్నట్టు. అబ్బాయి పేరేమిటన్నారూ సంగమూ, కుటుంబమూ?"

"సంగమేశ్వరరావు!"

"ఆ! సంగమేశ్వరరావునీ మీ యింటికి రమ్మనండి. ఉద్యోగం వేయించేద్దాం. అదిగో మిమ్మల్ని విశ్వంగారు పిలుస్తున్నారు. వొస్తానండి."

ఉదయం ఏడున్నరకే సంగమేశ్వరరావు మా యింటి కొచ్చేడు. నాముందు కూర్చున్నాడు. నేను విషయం చెప్పేను. అతను విని ఆనందంగా అన్నాడు.

"మీకు తెలీదుగానండి. మీకు చాలా పరువుంది. లేకపోతే ఆ పశుపతిగారు ఓ పట్టాన మీ మాట వినేవారనా?"

సంగమేశ్వరరావు లౌక్యాన్ని నేను మెచ్చుకోలేకపోయేను. ఈ సంగమేశ్వరరావు, వెంకట్రావు ఇద్దరూ కలిసి నా ప్రాణం తినేశారు. నాకప్పుడు కోడిపందేలు గుర్తు కొచ్చేయి. పందెపు కోడిలా నన్ను బరి మీదకి వొదిలేరు. ఎవర్నీ నమ్మకూడదు!

పశుపతిగారి కారు వారన్న టైముకి ఓ పావుగంట ముందే వొచ్చేసింది. ఆయనంత దూరాన్నుంచే నన్ను మొహంతో గబగబా వొచ్చేశారు చేతులూపుకుంటూ.

మాయింట్లో చాలా అందమైన కుర్చీలు రెండే వున్నాయి. సంగమేశ్వరరావు కొకటీ, నేనొకటీ వాడుకుంటే పశుపతి గారెక్కడ కూర్చుంటారనే విషయం ఆలోచిస్తూ నించున్నాను. అప్పుడు నాకో పాత కుర్చీ గూడా వున్నట్టు జ్ఞాపకం వొచ్చింది. ఆజ్ఞాపకానికి వెంటనే నొచ్చుకున్నాను. ●

